సాక్షి హనుమకొండ

శనివారం । 22 । మార్చి । 2025





ఒకే దేశం, ఒకే ఎన్నిక నష్టమే...

సమాజానికి 'ఒకే దేశం- ఒకే ఎన్నిక' నష్ట దాయకమని ప్రముఖ సామాజిక వేత్త, రిటైర్డ్ ప్రొఫెసర్ హరగోపాల్ అభిప్రాయపడ్డారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం $35^0/23^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. సాయంత్రం సమయంలో ఆహ్లాదంగా ఉంటుంది.

e టిమ్స్‌తో జీగా..

ఆర్టీసీలో డిజిటల్ చెల్లింపులతో టికెట్ల జారీ

- ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటున్న సంస్థ
- వరంగల్ రీజియన్‌కు చేరుకున్న 750 ఇ-టిమ్స్
- టికెట్ జారీపై మరింత స్పష్టత
- ప్రతి స్టేజీ వారీగా వివరాలు తెలుసుకునే సౌకర్యం

హన్మకొండ: ప్రయాణికులకు మెరుగైన, నాణ్యమైన సేవలందించేందుకు ఆర్టీసీ ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకుంటోంది. ప్రయాణికులకు సౌకర్యవంతంగా టికెట్ జారీకి ఇ-టిమ్స్‌ను ప్రవేశ పెట్టింది. దీనిలో భాగంగా ఆర్టీసీ వరంగల్ రీజియన్‌లోని ఆర్టీసీ బస్సుల్లో నగదు రహిత సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈమేరకు కండక్టర్లు, డ్రైవర్లకు శిక్షణ ఇస్తూ క్రమంగా ఇ-టిమ్స్‌ను ప్రవేశపెడుతున్నారు. ఇప్పటివరకు ఉపయోగించిన టిమ్స్‌తో చూసుకుంటే మరిన్ని ఫీచర్లతో వీటిని రూపొందించారు.

టిమ్‌పై క్యూఆర్ కోడ్

ప్రయాణికులు తమ వెంట నగదు లేకున్నా డిజిటల్ పేమెంట్స్ ద్వారా టికెట్ పొందే సౌకర్యం కలగనుంది. చిల్లర సమస్యకు తెర పడనుంది. టిమ్‌పై క్యూఆర్ కోడ్ ఉంటుంది. దాన్ని స్కాన్ చేయడం ద్వారా చెల్లింపులు చేసి టికెట్ పొందవచ్చు.

మరికొన్ని అవసరమే..

వరంగల్ రీజియన్‌లో ప్రతిరోజూ 936 బస్సులు వివిధ రూట్లలో తిరుగుతుంటాయి. 3.76 లక్షల కిలోమీటర్లు తిరిగి సగటున రోజుకు రూ.2.20 కోట్ల ఆదాయాన్ని సంస్థ రాబట్టుకుంటుంది. 936 బస్సులకుగాను ప్రస్తుతం 750 ఇ-టిమ్స్ మాత్రమే చేరుకున్నాయి. అన్ని బస్సుల్లో అమలుచేయాలంటే మరో 186 అవసరం. ఎప్పుడైనా టిమ్ మొరాయిస్తే బాగు చేసే వరకు వినియోగించుకునేలా అదనంగా మరికొన్ని అవసరం.



ప్రతీది ఆన్‌లైనే..

స్టేజీల వారీగా ఎన్ని టికెట్లు జారీ అవుతున్నాయి.. ఇందులో డిజిటల్ పేమెంట్స్ ద్వారా ఎన్ని, నగదు రూపేణా ఎన్ని, జీరో టికెట్లు ఎన్ని జారీ అయ్యాయో తెలుసుకునే సౌకర్యం ఉంది.

- ఆర్టీసీ డిపోలు, వరంగల్ రీజియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డ్యాష్ బోర్డు ద్వారా ప్రతీబస్‌లో జారీ అవుతున్న టికెట్ల వివరాలు స్టేజీల వారీగా అధికారులు ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు.
- ఈ టిమ్స్ పూర్తిస్థాయిలో పని చేయడానికి మరికొంత సమయం పట్టనుంది.
- ముందుగా ఆన్‌లైన్ ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టం (ఓపీఆర్ఎస్) వర్తింపజేస్తున్న బస్సులో వీటిని వినియోగించనున్నారు.
- కండక్టర్లు, డ్రైవర్లకు శిక్షణ ఇచ్చిన తర్వాత పల్లె వెలుగు బస్సుల వరకు క్రమంగా అమలు చేయడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.



ఆధునిక సాంకేతిక పద్ధతులతో ఇ-టిమ్స్

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఇ-టిమ్స్‌ను రూపొందించారు. ప్రస్తుతం రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తున్న బస్సుల్లో మాత్రమే వీటిని వినియోగిస్తున్నాం. క్రమంగా పల్లె వెలుగు వరకు అమలు చేస్తాం. వీటి ద్వారా ప్రయాణికులకు సులువుగా టికెట్ జారీ చేయవచ్చు.

- డి.విజయ భాను, ఆర్టీసీ వరంగల్ ఆర్‌ఎం



ఇ-టిమ్ డిజిటల్ పేమెంట్ ద్వారా టికెట్ జారీ..

న్యూస్‌రీల్

'హైపర్'తో సత్వర సేవలు

హన్మకొండ: హైపర్‌తో సత్వర సేవలు అందిస్తున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ, వరంగల్ ఎస్ఈలు పి.మధుసూదన్‌రావు, కె.గౌతం రెడ్డి శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు, భారీ వర్షాలు, ఈదురు గాలులు సంభవించినపుడు అతి తక్కువ సమయంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడానికి 'హైపర్' అనే కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని పేర్కొన్నారు.

హైపర్ అంటే..

'హెచ్' అంటే హెడ్ క్వార్టర్‌లో అప్రమత్తంగా ఉండడం, 'ఎ' అంటే సిబ్బంది, సామగ్రి సమీకరణ, 'ఐ' అంటే సమాచార సేకరణ, చేరవేయడం, 'పీ' అంటే పటిష్ట వ్యూహాన్ని అమలు పర్చడం, 'ఇ' అంటే నిర్దిష్ట కార్యాచరణ అమలు, 'ఆర్' అంటే విద్యుత్ సరఫరా పునరుద్ధరించడం అని ఎస్ఈలు వివరించారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయంలో డిష్యుం డిష్యుం



కాజీపేట అర్బన్ : వరంగల్ ఆర్వో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కమీషన్ విషయంలో శుక్రవారం రెండు వర్గాలు పరస్పరం దాడులు చేసుకున్నాయి. నగరంలోని ఓ భూమి రిజిస్ట్రేషన్ నిమిత్తం భూక్రయవిక్రయదారులతోపాటు రియల్టర్లు కార్యాలయానికి వచ్చారు. రిజిస్ట్రేషన్ సాయంత్రం ఆరు గంటలకు పూర్తి కాగా కార్యాలయ ఆవరణలోనే భూమి అమ్మకంలో పాత్ర పోషించిన తమకు రావాల్సిన కమీషన్ ఇవ్వాలని రియల్టర్లు గొడవకు దిగారు. గొడవ కాస్త ఘర్షణకు దారి తీసి ఒకరిపై మరొకరు పిడిగుద్దులు కురిపించుకున్నారు. చొక్కాలు చింపుకునే స్థాయికి చేరుకోవడంతోపాటు కార్యాలయ ఆవరణలో కుర్చీలను విసిరేసుకున్నారు. దీంతో పలువురికి గాయాలయ్యాయి. కుర్చీలు ధ్వంసమయ్యాయి. ఇరువర్గాల వారు డయల్ 100కు ఫోన్ చేయగా, పోలీసులు ఘటన స్థలానికి చేరుకునే సరికి పలాయనం చిత్తగించారు.

శాంతిని కోరుతూ కవి సమ్మేళనం




హన్మకొండ కల్చరల్ : ప్రపంచ కవితాదినోత్సవాన్ని పురస్కరించుకుని వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం హనుమకొండలోని హోటల్ అశోక కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన బహుభాషా కవి సమ్మేళనం అలరించింది. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి పలువురు కవులు పాల్గొని 'కవులు ప్రపంచానికి ఏమవుతారు ?' అనే అంశంపై తమ కవితలు వినిపించారు. అనంతరం హనుమకొండ సైబర్ క్రైమ్ ఏసీపీ కూజ విజయ్‌కుమార్ ఉత్తమ కవితలు వినిపించిన కవులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, మిగిలిన వారికి ప్రశంసపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ వ్యవస్థాకుడు సిరాజుద్దీన్, ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఆచార్య బి.సురేష్, సంస్థ ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రావు, కోశాధికారి విష్ణువర్ధన్, సంస్థ బాధ్యులు పాల్గొన్నారు.

'కుడా'కు భూమి అప్పగింత

నయీంనగర్: కాకతీయ పట్టణ అభివృద్ధి సంస్థ (కుడా) పరిధిలోని పైడిపల్లి రైతులు వారి గ్రామానికి చెందిన 10 ఎకరాల వ్యవసాయ పట్టా భూమిని అభివృద్ధి కోసం 'కుడా'కు అప్పగించారు. ఈ మేరకు కుడా కార్యాలయంలో శుక్రవారం చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డిని కలిసి భూమికి సంబంధించిన పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తమ గ్రామం ఆర్థికంగా అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలనే ఆకాంక్షతో 'కుడా'కు భూమి ఇచ్చినట్లు తెలిపారు.

చీటింగ్ బెట్టింగ్

ఐపీఎల్ వేళ యాప్‌లతో పందేల జోరు



అత్యాశకు వెళితే ఆర్థికంగా నష్టపోవుడే..

- పిల్లలపై ఓ కన్నేసి ఉంచాల్సిందే
- తల్లిదండ్రుల అప్రమత్తత అవసరమే
- గత ఘటనలను గుర్తు చేస్తున్న పోలీసులు

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ హనుమకొండలో స్నేహితులతో కలిసి ఉంటూ ఉద్యోగం కోసం కోచింగ్ తీసుకునేవాడు. ఈ క్రమంలోనే ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడి సుమారు రూ.30 లక్షల వరకు పోగొట్టుకున్నాడు. ఇందుకోసం అప్పులు చేశాడు. చివరకు తండ్రికి విషయం చెప్పి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. దీంతో ఆయన ఉన్న ప్లాటును అమ్మి అప్పులు తీర్చాడు. అయితే ఎలాగైనా పోయిన డబ్బులు సంపాదించాలని రాజ్‌కుమార్ మళ్లీ అప్పులు చేసి యాప్‌లో బెట్టింగ్ కాశాడు. ఈ క్రమంలోనే అప్పుల వాళ్ల వేధింపులు పెరగడంతో ఈ ఏడాది జనవరి ఐదున తండ్రిని రూ.నాలుగు లక్షలు అడిగాడు. తండ్రి లేవని చెప్పడంతో రాజ్‌కుమార్ ఉరేసుకుని జనవరి 10న ఆత్మహత్య చేసుకున్నాడు.

రాయపర్తికి చెందిన కొండపల్లి ధర్మరాజు డిగ్రీ చదివి బిర్యానీ సెంటర్ నిర్వహించి నష్టపోయాడు. హనుమకొండకు మకాం మార్చి పోస్టల్‌కాలనీలో తాను విద్యార్థినని చెప్పి అద్దె గదిలో నివాసం ఉన్నాడు. ఈ క్రమంలోనే ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడి అప్పులై దొంగ అవతారం ఎత్తాడు. హనుమకొండ, హసన్‌పర్తి, కేయూసీ, సుబేదారి, సంగెం, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, దేవరుప్పుల పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 17 చోరీల్లో 334 గ్రాముల బంగారు ఆభరణాలు, కిలో 640 గ్రాముల వెండి చోరీ చేశాడు. చివరకు గత అక్టోబర్ 28న పోలీసులకు చిక్కాడు.

సాక్షి, వరంగల్:

ఐపీఎల్ రానే వచ్చింది. శనివారం నుంచి ఈ టోర్నీ ప్రారంభం కానుంది. దీంతో ఈ జోష్‌ను క్యాష్ చేసుకునేందుకు బెట్టింగ్ రాయుళ్లు సిద్ధమవుతున్నారు. గతంతో నగరాలకే పరిమితమైన ఈ బెట్టింగ్ ప్రస్తుతం పల్లెలకు సైతం విస్తరిస్తోంది. ఎవరితో సంబంధం లేకుండానే ఫోన్‌లోనే క్రికెట్ బెట్టింగ్ యాప్‌లు నిక్షిప్తం చేసుకొని ఫోన్‌పే, గూగుల్ పే, యూపీఐ ఐడీలతో డబ్బులు బదిలీ చేస్తూ బెట్టింగ్ చేస్తున్నారు. కొందరేమో తమ తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాలు అనుసంధానం చేసి ఉన్న యూపీఐ ఐడీల ద్వారా, మరికొందరు కాలేజీలో పరీక్షలు, హాస్టల్ ఫీజు అని తల్లిదండ్రుల నుంచి డబ్బులు వసూలు చేసి ఈ బెట్టింగ్ చేస్తున్నారు. ఇప్పుడు ఐపీఎల్ మొదలవుతుండడంతో ఈ బెట్టింగ్ యాప్‌ల జోరు పెరగొచ్చని వరంగల్ కమిషనరేట్ పోలీసులు అనుమానిస్తున్నారు. అందుకే పిల్లలు వాడే సెల్‌ఫోన్లు, వారి ప్రవర్తనపై కన్నేసి ఉంచాలని సూచిస్తున్నారు. యాప్‌ల్లో డబ్బులు పోయి ఏకంగా ప్రాణాలు తీసుకున్న యువకులు ఉన్నారు. ఆ దిశగా ఎవరూ వెళ్లొద్దని పోలీసులు అంటున్నారు. బెట్టింగ్ పెట్టే వాళ్లపై కేసులు నమోదుచేసే అవకాశం ఉండడంతోనే దందా నిర్విరామంగా సాగుతోందని, బెట్టింగ్ చేసిన వారు పోలీసులకు ఫిర్యాదు చేసే అవకాశం ఉండకపోవడం కూడా ఓ కారణమని చెప్పవచ్చు.

75 బెట్టింగ్ వెబ్‌సైట్లు, యాప్‌లు

స్పోర్ట్స్ బెట్టింగ్ కార్యకలాపాల విలువ భారత్‌లో ప్రతి ఏటా రూ.8,20,000 కోట్ల దాకా ఉంటుందని థింక్ చేంజ్ ఫోరమ్ (టీసీఎఫ్) నివేదిక చెబుతోంది. భారత్‌లో 14 కోట్ల మంది బెట్టింగ్, గ్యాంబ్లింగ్ కార్యకలాపాల్లో పాలుపంచుకుంటున్నారు. ఐపీఎల్ సీజన్‌లో ఈ సంఖ్య 37 కోట్ల దాకా పెరుగుతోందని టీసీఎఫ్ నివేదిక పేర్కొనడం చూస్తే బెట్టింగ్ యాప్ జోరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. దాదాపు 75 వెబ్‌సైట్లు, యాప్‌లు బెట్టింగ్‌కు సంబంధించినవి పనిచేస్తున్నాయి.

రేషియో యాప్‌ల జోరు..

క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకులు ఒకప్పుడు ఫోన్ల ద్వారా ఆయా జట్టు విజయాలపై బుకీలకు సమాచారం ఇచ్చేవారు. ఫంటర్లను పెట్టుకొని దందా నడిపేవారు. ఇప్పటికీ ఈ దందా ఉన్నా.. ఇప్పుడు రూపు మార్చుకుంటోంది. ముఖ్య నిర్వాహకుడే యాప్ రూపొందించి బుకీలకు యూజర్ నేమ్, పాస్‌వర్డ్‌లు ఇచ్చి నయా దందాకు శ్రీకారం చుడతాడు. ప్రధాన నిర్వాహకులు ఆయా జట్ల విజయాలకు సంబంధించిన రేషియోను ఆ యాప్‌లో నిక్షిప్తం చేస్తుండడంతో ఇందుకు అనుగుణంగా బుకీలు తమ ఫంటర్లకు చెప్పి దందా చేస్తారు. ఇలా బుకీలకు వచ్చిన ఆదాయంలోనే కొంత డబ్బును ప్రధాన నిర్వాహకుడికి అందిస్తారు. యూపీఐ చెల్లింపులతో పోలీసులకు దొరికే అవకాశం ఉండడంతో బిట్‌కాయిన్ల రూంలో దందా చేస్తుండడం గమనార్హం. గతంలో పోలీసులకు చిక్కిన బెట్టింగ్ బుకీలతో ఈ దందా వెలుగులోకి వచ్చింది.

యాప్‌ల సమాచారం ఇవ్వాలి..



గూగుల్ ప్లే స్టోర్ నుంచి డప్పాబెట్, 1 ఎక్స్ బెట్, స్కై ఎక్స్‌చేంజ్, ఫ్యాన్సీ లైఫ్, క్రికెట్ మజా, లైవ్ లైన్ గురూ, లోటస్, బెట్ 65, బెట్ ఫెయిర్ వంటి ఆన్ లైన్‌క్రికెట్ బెట్టింగ్ యాప్‌లు డౌన్ లోడ్ చేసి పందెంకాస్తూ నష్టపోయిన వారు గతంలో చాలా మంది ఉన్నారు. బెట్టింగ్ యాప్‌ల గురించి సమాచారం తెలిస్తే ఇవ్వాలి. బెట్టింగ్ ఎవ్వరూ చేయవద్దు. ఈ బెట్టింగ్‌లతో యువత కెరీర్ ఇబ్బందుల్లో పడుతుంది.

- సన్‌ప్రీత్‌సింగ్, వరంగల్ పోలీస్ కమిషనర్

టెన్త్ పరీక్షలు ప్రారంభం



శాయంపేటలో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు





కమలాపూర్ : బోర్డుపై హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు. ఆత్మకూరులో..

- హనుమకొండ జిల్లాలో 99.95శాతం, వరంగల్ జిల్లాలో 99.8శాతం హాజరు
- కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్లు, డీఈఓలు

విద్యారణ్యపురి: పదో తరగతి పరీక్షలు మొదటి రోజు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. హనుమకొండ జిల్లాలోని 67 కేంద్రాల్లో, వరంగల్‌లో 49కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా, విద్యార్థులు నిర్ణీత సమయానికంటే ముందుగానే చేరుకున్నారు. వారితోపాటు తల్లిదండ్రులు కూడా రావడంతో పరీక్ష కేంద్రాల వద్ద సందడి నెలకొంది. విద్యార్థులను పరీక్ష సిబ్బంది తనిఖీ చేశాకే లోనికి అనుమతించారు. ఉదయం 9-30 గంటల నుంచి మధ్యాహ్నం 12-30 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. హనుమకొండ జిల్లాలో 12,003 మంది విద్యార్థులకు 11,997 మంది హాజరైనట్లు (99.95 శాతం) డీఈఓ డివాసంతి తెలిపారు. ఐనవోలు మండలం పున్నేలు జిల్లా పరిషత్ హైస్కూల్ పరీక్ష కేంద్రంతోపాటు మరో మూడు కేంద్రాలను కలెక్టర్ ప్రావీణ్య తనిఖీ చేశారు. డీఈఓ వాసంతి, తహసీల్దార్ విక్రమ్‌కుమార్ ఉన్నారు.



పున్నేలు పరీక్ష కేంద్రంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

చారిత్రక గడిని కూల్చవద్దని ధర్నా



గడిని కూల్చివేయొద్దంటూ ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కమలాపూర్: చారిత్రక గడిని కూల్చివేయొద్దని కోరుతూ కుల సంఘాల ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆందోళనకు దిగి ధర్నా చేపట్టారు. మండల కేంద్రంలో కాకతీయుల కాలంలో నిర్మించిన చారిత్రక గడిని కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు తాము కొనుగోలు చేశామనే నెపంతో కూల్చివేతకు పాల్పడుతున్నారని ఆరోపించారు. చారిత్రక కట్టడాలను అమ్మడం, కొనడం అంటే ప్రజల విశ్వాసాలను దెబ్బతీయడమేనని, తాతలకాలం నుంచి ఈ గడి గ్రామ దేవతలకు నిలయంగా ఉంటోందని, ఇక్కడినుంచే సమ్మక్క-సారలమ్మ జాతరకు, దసరా వేడుకలకు అంకురార్పణ జరుగుతుందన్నారు. చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తున్న ఈ గడిని కూలగొట్టకుండా భావితరాల కోసం అలాగే ఉంచాలని కోరారు. గడి కూల్చివేతను వ్యతిరేకిస్తూ కుల సంఘాల ఆధ్వర్యంలో గ్రామస్తులు, యువకులు శుక్రవారం గడిని పరిశీలించి అక్కడే నిరసన ఆందోళనకు దిగి ధర్నా చేపట్టారు. ఆందోళనలో మాజీఎంపీటీసీ మాట్ల వెంకటేశ్వర్లు, కుల సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు, యువకులు నాంపెల్లి మొగిలి, మంచాల రాజయ్య, అట్ల సమ్మయ్య, కిన్నెర కృష్ణమూర్తి, వెంగళ సహదేవ్, ఎండీ.దుర్వేశ్, రాముల అశోక్, సంపత్, సతీశ్, పిట్టల కృష్ణ, మాట్ల సాగర్, రాజు, శ్రీధర్, రమేశ్ పాల్గొన్నారు.

బాలికల సంరక్షణకు మరిన్ని కార్యక్రమాలు

కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్ : సమాజంలో బాలికా సంరక్షణ కోసం మరిన్ని కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమం పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు మహిళా పోలీసులు, ఉద్యోగులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ బాలికా సంరక్షణ కార్యక్రమాలను సమాజంలో మరింత ముందుకు తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖ అధికారి జయంతి, డీఆర్డీఏ పీడీ మేన శ్రీను, డీఎంహెచ్ఓ అప్పయ్య, డెమో అశోక్‌రెడ్డి, షీ టీమ్, భరోసా ఇన్‌స్పెక్టర్లు సుజాత, సువర్ణ, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న, సీడీపీఓ విశ్వజ, బాల రక్షా భవన్ కో-ఆర్డినేటర్ సీహెచ్.అవంతి, మెప్మా అధికారి రాజేశ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలులో కలెక్టర్ ఆకస్మిక పర్యటన

పాఠశాల, పీహెచ్‌సీ, అంగన్వాడీ కేంద్రాల పరిశీలన

ఐనవోలు: మండలంలో కలెక్టర్ ప్రావీణ్య శుక్రవారం ఆకస్మికంగా పర్యటించారు. ముందుగా కక్కిరాలపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న స్ట్రెంథనింగ్ ఎఫ్ఎల్ఎన్ త్రూ ఏఐ టూల్స్ శిక్షణ కార్యక్రమాన్ని డీఈఓ వాసంతితో కలిసి కలెక్టర్ ప్రావీణ్య పరిశీలించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక అంశాల్లో రాణించేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలన్నారు. ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ సంబంధించిన అంశాలపై విద్యార్థులు కంప్యూటర్‌ను ఆపరేట్ చేస్తుండగా ప్రత్యక్షంగా పరిశీలించారు. వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో అదనపు అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేసి అందించాలన్నారు. పాఠశాలకు చెందిన వివిధ తరగతి గదులు, కిచెన్ షెడ్‌తో పాటు ఇటీవల కొనుగోలు చేసిన క్రీడా సామగ్రిని పరిశీలించారు. పాఠశాలకు వచ్చిన పలువురు స్థానికులు సాగు, తాగునీటితోపాటు వీధి దీపాలు, దివ్యాంగుల పింఛన్ తదితర సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. అద్దె భవనంలో నిర్వహిస్తున్న అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా ఉన్న భవనంలోకి మార్చాలని ఆదేశించారు. పున్నేలు జీపీ ఆధ్వర్యంలో వేసవి కాలం దృష్ట్యా పాఠశాల ఎదురుగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా కలెక్టర్ ప్రావీణ్య ప్రారంభించారు. చలివేంద్రం నిర్వహణ పరిశుభ్రంగా ఉండాలని ఆమె సూచించారు.



విద్యార్థి సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

పీహెచ్‌సీ తనిఖీ..

ఐనవోలు పీహెచ్‌సీని కలెక్టర్ తనిఖీ చేశారు. వైద్య సేవల నిమిత్తం ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఇన్ పేషంట్ వార్డును సందర్శించి రోగులతో కలెక్టర్ మాట్లాడారు. వైద్యులు, సిబ్బంది హాజరు పట్టికను, స్టాక్ రిజిస్టర్, మెయింటెనెన్స్ రికార్డులను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎన్ని సబ్ సెంటర్లు ఉన్నాయి? వారి నిర్వహణ గురించి మెడికల్ ఆఫీసర్ శ్రీనివాస్‌ను ప్రశ్నించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను సబ్‌సెంటర్ల ద్వారా పంపిణీ చేయాలని, నిరంతరం వైద్యులు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఎంఈఓ పులి ఆనందం, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, మెడికల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఆర్ఐ మల్లయ్య, జీపీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పట్టు రైతులకు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న పట్టుపరిశ్రమ జేడీ అనసూయ

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల పట్టు రైతులకు శుక్రవారం ఎల్కతుర్తి రైతు వేదికలో అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో పట్టుపరిశ్రమ జిల్లా సంయుక్త సంచాలకురాలు (జేడీ) అనసూయ ముఖ్య అతిథిగా హాజరై రైతులనుద్దేశించి మాట్లాడారు. పట్టు పురుగుల పెంపకం రైతులు సాగు చేసిన మల్బరీ తోటల్లో సేంద్రియ ఎరువులు వాడడం వల్ల ఆకు నాణ్యత పెరిగి అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. సిల్క్ సమగ్ర-2 పథకం కింద కొత్తగా మల్బరీ నాటే ఎస్సీ, ఎస్టీ రైతులకు రీలింగ్ షెడ్ నిర్మాణానికి రూ.2,92,500, మల్బరీ నాటినందుకు రూ.78 వేలు సబ్సిడీ ఇవ్వనున్నట్లు ఆమె వెల్లడించారు. అలాగే 300 నేత్రికలు, 10 ట్రేలు, ఇరిగేషన్ కోసం రూ.60 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. బీసీ, ఓసీ రైతులకు షెడ్ నిర్మాణానికి రూ.2.25 లక్షలు, 300 నేత్రికలు, 10 ట్రేలు, 2,500 రోగనిరోధక మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగపర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు సారంగపాణి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, కలెక్టర్, మేయర్, సీపీ, దర్గా పీఠాధిపతి





కాజీపేట హజరత్ సయ్యద్ షా అఫ్జల్ బియాబానీ దర్గాలో శుక్రవారం రాత్రి దర్గా పీఠాధిపతి ఖుస్రుపాషా ప్రజాప్రతినిధులకు, జిల్లా అధికారులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, సీపీ సన్‌ప్రీత్ సింగ్, మేయర్ గుండు సుధారాణి, 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- కాజీపేట రూరల్

ప్రైవేట్ అప్పులు తీర్చేందుకు అదనపు రుణాలు



వ్యవసాయాధికారులు, రైతులతో డీఎల్ఎస్ఏ కార్యదర్శులు

వరంగల్ లీగల్ : రైతుల ప్రైవేట్ అప్పులు తీర్చుకోవడానికి, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం బ్యాంకుల నుంచి పంట రుణాలకు అదనంగా దీర్ఘకాలిక రుణాలు పొందేందుకు రైతులు దరఖాస్తులు చేసుకోవాలని హనుమకొండ, వరంగల్ జిల్లాల న్యాయసేవాధికార సంస్థల కార్యదర్శులు జడ్జి క్షమాదేశ్ పాండే, ఎం.సాయికుమార్ సూచించారు. శుక్రవారం తెలంగాణ రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు అధ్యక్షతన జిల్లా కోర్టు ఆవరణలో బ్యాంకర్లు, రెవెన్యూ అధికారులు, వ్యవసాయాధికారులు, రైతులతో హనుమకొండ, వరంగల్ న్యాయసేవాధికారి కార్యదర్శులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ.. జిల్లా న్యాయసేవాధికార సంస్థల కార్యదర్శుల సూచన మేరకు అర్హులైన రైతులందరికీ ప్రైవేట్ అప్పులు తీర్చుకోవడానికి అదనపు రుణాలు మంజూరు చేసేందుకు బ్యాంకర్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. సమావేశంలో తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కిషన్‌రావు, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్, తిరుపతి, రాజు, బాపురావు, సీఐఎస్ఎఫ్ కోఆర్డినేటర్ తోకల్ ఆదిరెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి రవికుమార్, బ్యాంకర్లు, వ్యవసాధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ల పరీక్షలు నిర్వహించలేం

- కేయూ రిజిస్ట్రార్‌కు ప్రైవేట్ యాజమాన్యాల వినతి



వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ బాధ్యులు

కేయూ క్యాంపస్: 'కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వం విడుదల చేయడం లేదు.. దీంతో ఆర్థికపరమైన సమస్యలు ఎదుర్కొంటున్నాం.. అందుకే రాబోయే రోజుల్లో యూనివర్సిటీ డిగ్రీ కోర్సుల 2,4,6 సెమిస్టర్‌ల పరీక్షలు నిర్వహించలేం' అని ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ బాధ్యులు స్పష్టం చేశారు. ఈమేరకు శుక్రవారం రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రాన్ని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రావు మాట్లాడుతూ గత 20 నెలలకు సంబంధించిన ఫీజులు చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు ఇబ్బందులకు గురవుతున్నాయన్నారు. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయొద్దని, ఆర్‌టీఎఫ్ ద్వారా ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పడంతో నిరీక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. కొన్ని యాజమాన్యాలు అప్పులు చేసి కళాశాలలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కళాశాలలు నిర్వహించే పరిస్థితి లేదని, ఈనెల 25 వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సుమారు రూ.2,500 కోట్లు చెల్లించని పక్షంలో ఏప్రిల్‌లో డిగ్రీకోర్సుల 2,4,6 సెమిస్టర్ల పరీక్షల నిర్వహణ సాధ్యం కాదని స్పష్టం చేశారు. రిజిస్ట్రార్‌ను కలిసిన వారిలో అసోసియేషన్ కేయూ అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శి జి.వేణుమాధవ్, ఇతర బాధ్యులు ఉన్నారు.

అర్ధరాత్రి.. మూగజీవాల మృత్యుఘోష

గొర్రెలు, మేకల ఫామ్‌లో వ్యాపించిన మంటలు
- సజీవదహనమైన 450 జీవాలు.. సుమారు రూ.30లక్షల నష్టం
- ఆకతాయిల పనేనంటున్న బాధితులు
- ఘటన స్థలాన్ని సందర్శించిన డీసీపీ సలీమా, ఏసీపీ నందిరాంనాయక్



ఘటన స్థలాన్ని పరిశీలించి బాధిత కుటుంబంతో మాట్లాడుతున్న డీసీపీ సలీమా, అధికారులు

ఖిలా వరంగల్ : ఆ మూగజీవాలు ప్రమాదమని గుర్తించలేవు. కాపాడండి అని అరవలేవు. మద్యం మత్తులో ఆకతాయిలు చేసిన పనికి అర్ధరాత్రి మాంసంముద్దలయ్యాయి. వాటినే నమ్ముకున్న ఓ వ్యక్తి కుటుంబం రోడ్డున పడింది. ఇంతటి ఘాతుకానికి పాల్పడిందెవరు?.. అన్నది పోలీసులు తేల్చాల్సి ఉంది. ఖిలావరంగల్ మట్టికోట ఎల్బీగండి సమీపాన గొర్రెలు, మేకల ఫామ్‌లో గురువారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో 450 గొర్రెలు, మేకలు సజీవ దహనమైన విషయం తెలిసిందే. సుమారు రూ.30లక్షల ఆస్తినష్టం జరిగిందని బాధితులు బోరున విలపిస్తున్నారు.

ఫామ్‌ను సందర్శించిన పోలీసులు

అగ్ని ప్రమాదం జరిగిన స్థలాన్ని శుక్రవారం ఉదయం వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ సలీమా, ఏసీపీ నందిరామ్‌నాయక్‌తోపాటు పశుసంవర్ధకశాఖ జేడీ బాలకృష్ణ, తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు, ఎంహెచ్ఓ రాజేష్, ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం, స్థానిక కార్పొరేటర్ ఉమ సందర్శించారు. మాంసం ముద్దలైన మూగజీవాలను పరిశీలించా రు. బాధితులైన దుగ్గిరాల లక్ష్మణ్, దుగ్గిరాల కుమారీలను పరామర్శించి ధైర్యాన్ని కల్పించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని, భవిష్యత్తులో కూడా అన్ని విధాలుగా అదుకుంటామని డీసీపీ హామీ ఇచ్చారు.

మొదలైన దర్యాప్తు

గొర్రెల ఫామ్‌లో గురువారం రాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో జరిగిన నష్టం మీద బాధితురాలు దుగ్గిరాల కుమారీ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫామ్‌లో కరెంట్ సరఫరా లేదని, బ్యాటరీ సహాయంతో సీసీ కెమెరాలు పనిచేస్తాయని, అవికూడా మంటల్లో పూర్తి కాలిబూడిదైనట్లు తెలిపింది. ఆంధ్రానుంచి బతుకు దెరువు కోసం వలస వచ్చి.. కోట ప్రాంతంలో స్థలాన్ని లీజుకు తీసుకుని ఫామ్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నామని, శతృవులంటూ ఎవరూ లేరని, మద్యం, గంజాయికి బానిసైన ఆకతాయిలే ఫామ్‌కు నిప్పు అంటించి ఉంటా రని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది.

ప్రభుత్వం ఆదుకోవాలి..



ఆకతాయిలు చేసిన పనికి నా కుటుంబం రోడ్డు మీద పడింది. జీవనాధారమైన 450 మూగ జీవాలు మంటల్లో మాంసం ముద్దలయ్యాయి. సుమారు రూ.30లక్షల విలువైన గొర్రెలు, మేకల మృతి చెందాయి. ప్రభుత్వమే నా కుటుంబాన్ని ఆదుకోవాలి.

- దుగ్గిరాల లక్ష్మణ్, బాధితుడు

కళేబరాల పూడ్చివేత

బల్దియా అధికారులు పరిసర ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలకుండా గొర్రెలు, మేకల కళేబరాలను వాహనాల్లో ఇతర ప్రాంతాలకు తరలించి పూడ్చివేశారు.. అంతకుముందు పశువైద్యులు కళేబరాలనుంచి శాంపిల్స్ సేకరించారు.

లేని ఫైర్ స్టేషన్

ఖిలావరంగల్ మండల పరిధిలో ఫైర్‌స్టేషన్ లేదు. చుట్టూ పది కిలోమీటర్ల మేర మండలం విస్తరించి ఉంది. ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు సంభవిస్తే వర్ధన్నపేట, హనుమకొండ, మట్టెవాడ పరిధిలోనుంచి ఫైరింజన్లు రావాలి. ఆ లోగా మంటలు పూర్తిగా అంటుకుని బుగ్గి అవుతోందని స్థానికులు చెబుతున్నారు.

సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల కేర్‌టేకర్ సస్పెన్షన్

విద్యారణ్యపురి: కాకతీయ యూనివర్సిటీ సమీపంలోని వరంగల్ పశ్చిమ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల (బాలికల)లో కేర్‌టేకర్‌గా విధులను నిర్వర్తిస్తున్న పీఈటీ వనమాలను కలెక్టర్ ప్రావీణ్య సస్పెండ్ చేశారు. ఈ మేరకు ఈనెల 20న ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. ఇటీవల కలెక్టర్ ఆ గురుకుల కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో కిచెన్ (మెస్) పరిసర ప్రాంతాలను పరిశీలించగా అపరిశుభ్రంగా ఉన్నట్లుగా గుర్తించారు. మెస్ నిర్వహణ సరిగా లేదని, పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని, కూరగాయలు ఫంగస్‌తో ఉండడం గుర్తించినట్లు సమాచారం. అదే విధంగా స్టోర్‌రూమ్‌లో బియ్యం బస్తాలను కిందనే నిలువ చేసినట్లు గమనించారు. ఆయా కారణాలు చూపుతూ కేర్‌టేకర్‌గా విధుల్లో నిర్లక్ష్యం వహించడంతో వనమాలపై సస్పెన్షన్ వేటు వేశారు.

ప్రిన్సిపాల్ సుభాషిణిదేవికి షోకాజ్ నోటీస్..

కళాశాల ప్రిన్సిపాల్ సుభాషిణిదేవికి కలెక్టర్ ప్రావీణ్య షోకాజ్ నోటీస్ జారీచేశారు. గురుకుల కళాశాల హాస్టల్‌లో గుర్తించిన సమస్యలను ప్రస్తావిస్తూ ప్రిన్సిపాల్‌గా ఆమె కూడా తన విధుల్లో నిర్లక్ష్యం వహించారని, మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆ నోటీస్‌లో పేర్కొన్నట్లు సమాచారం.

ఎంటీపీ యాక్ట్ నిబంధనలు కఠినంగా పాటించాలి

- హనుమకొండ డీఎంహెచ్ఓ అప్పయ్య



స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న బృందం సభ్యులు

ఎంజీఎం: జిల్లాలో పీసీఅండ్ పీఎన్‌డీటీ, ఎంటీపీ యాక్ట్ నిబంధనలను ఆస్పత్రులు, క్లినిక్‌లు, స్కానింగ్ సెంటర్ల యాజమాన్యాలు కఠినంగా పాటించాలని హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య సూచించారు. ఈ మేరకు రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా శుక్రవారం నగరంలోని నాలుగు స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేశారు. రికార్డులు, సర్టిఫికెట్‌లు, స్కానింగ్ మెషీన్‌లు, ఫామ్ - ఎఫ్, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రికార్డులను పరిశీలించారు. ఎంటీపీ రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు మాత్రమే నిబంధనలకు లోబడి ఇద్దరు డాక్టర్ల సమక్షంలో అబార్షన్స్ చేయాలని, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు లేకుండా అర్హత లేని డాక్టర్లు అబార్షన్స్ చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతినెలా చేసిన అబార్షన్స్ వివరాలు డీఎంహెచ్ఓ కార్యాలయంలో అందించాలని సూచించారు. కార్యక్రమంలో జీఎంహెచ్ ప్రొఫెసర్ డాక్టర్ రాజేశ్వరి, ఎంసీహెచ్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ మంజుల, డాక్టర్ జమున, మహిళా శిశు సంక్షేమ శాఖ సఖి వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ హైమావతి, వరంగల్ కమిషనరేట్ భరోసా సెంటర్ ఎస్సై బోయిన మంగ, హెచ్ఈఓ రాజేశ్వర్ రెడ్డి, సందీప్, పాల్గొన్నారు.

కల్తీ, కాలంచెల్లిన ఐస్‌క్రీమ్ ఉత్పత్తుల స్వాధీనం



పట్టుబడిన కల్తీ ఐస్‌క్రీమ్ ఉత్పత్తులను చూపిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

ఖిలా వరంగల్: ఐస్‌క్రీమ్ డిస్ట్రిబ్యూటర్ షాపుపై దాడిచేసి రూ.93,200ల విలువైన కల్తీ, కాలం చెల్లిన ఐస్ క్రీమ్ ఉత్పత్తులను స్వాధీన పర్చుకుని, షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ జి.బాబులాల్ తెలిపారు. మామునూరు పోలీస్ స్టేషన్ పరిధి నాయుడు పెట్రోల్‌బంక్ సమీపంలో ఏనుగంటి సురేష్ ఐస్‌క్రీమ్ డిస్ట్రిబ్యూటర్ షాపులో కల్తీ, కాలం చెల్లిన ఐస్‌క్రీమ్ ఉత్పత్తులను విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారం టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్‌కు అందింది. ఆయన ఆదేశాల మేరకు శుక్రవారం మధ్యాహ్నం ఆ షాపుపై టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ బాబులాల్ ఆధ్వర్యంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి నేతృత్వంలో దాడి చేశారు. నిల్వ చేసిన రూ.93,200ల విలువైన కల్తీ, కాలం చెల్లిన ఐస్‌క్రీమ్ ఉత్పత్తులను స్వాధీన పర్చుకుని, వ్యాపారి సురేష్‌పై కేసు నమోదు చేసి తదిపరి చర్యల నిమిత్తం కేసును మామునూరు పోలీసులకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ బాబులాల్ తెలిపారు.

ఒకే దేశం, ఒకే ఎన్నిక నష్టమే..

- సంకీర్ణ ప్రభుత్వాలతోనే ప్రజాస్వామ్యానికి రక్షణ
- ప్రముఖ సామాజికవేత్త ప్రొఫెసర్ హరగోపాల్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

కేయూ క్యాంపస్: భిన్నత్వంలో ఏకత్వంతో కూడిన భారతీయ సమాజానికి 'ఒకే దేశం- ఒకే ఎన్నిక' నష్టదాయకమని ప్రముఖ సామాజిక వేత్త హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ హరగోపాల్ అభిప్రాయపడ్డారు. శుక్రవారం కాకతీయ యూనివర్సిటీ సెనెట్ హాల్‌లో రాజనీతిశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'భారత సమాజంలో సంకీర్ణ ప్రభుత్వాలు ప్రజాస్వామ్యం' అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన కీలకోపన్యాసం చేశారు. రాజకీయ పార్టీల మేనిఫెస్టోలు ఓటర్లను ఆకర్షించడానికి ఉపయోగపడుతున్నప్పటికీ వాటి అమలులో మాత్రం చిత్తశుద్ధి లోపిస్తోందన్నారు. దేశంలోని విభిన్న జాతులు, కులాలు, మతాలు, బహుళ సంస్కృతి, సంప్రదాయాలతో కలిసిమెలిసి జీవిస్తున్న ప్రజల హక్కులు, ప్రజాస్వామ్యానికి సంకీర్ణ ప్రభుత్వాలతోనే రక్షణ సాధ్యమని ఆయన అన్నారు. నిత్యం ప్రజలు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరిస్తూ.. ప్రజల జీవితాల్లో మెరుగైన మార్పులు తెచ్చి సమాజాన్ని శాస్త్రీయంగా విశ్లేషిస్తూ ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడమే రాజకీయ పార్టీల ప్రధాన కర్తవ్యంగా ఉండాలన్నారు. నేటి రాజకీయ పార్టీలు కార్పొరేట్ శక్తుల ధన ప్రలోభాలకు లోనై ఓటర్లను ప్రభావితం చేయడం ప్రజాస్వామ్య ఉనికికి ప్రమాదకరమన్నారు. 1960 దశకం చివరి నుంచి దేశంలో ప్రభుత్వాల ఏర్పాటులో ప్రాంతీయ పార్టీల ప్రభావం పెరిగిందన్నారు. 1991లో దేశంలో నూతన ఆర్థిక పారిశ్రామిక విధానాలు, గ్లోబలైజేషన్ ప్రభావంతో సమాజంలో మానవీయ సంబంధాలు కనుమరుగై, మార్కెట్ సంబంధాలు పెరిగిపోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఉగ్రవాద సంస్థల్లో మార్పు తీసుకొచ్చేందుకు కార్పొరేట్ శక్తులతో ఏర్పడిన అసమాన సమాజాన్ని తొలగించేందుకు మానవీయ శాస్త్రాలు, రాజనీతి శాస్త్ర ప్రాముఖ్యత అవసరమన్నారు. నేటితరం విద్యార్థులు సమాజ అభివృద్ధి కోసం ప్రశ్నించేతత్వాన్ని, ప్రజాస్వామిక లక్షణాలను పెంపొందించుకోవాలని హరగోపాల్ సూచించారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా..

ప్రాంతీయ పార్టీలతో ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వాలు ప్రజలకు జవాబుదారీగా ఉంటాయని గుల్బర్గా యూనివర్సిటీ యాక్టింగ్ వీసీ ప్రొఫెసర్ శ్రీరాములు అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణమైన పాలన అందిస్తేనే ప్రాంతీయ పార్టీల ప్రభుత్వాలు, సంకీర్ణ ప్రభుత్వాలకు మనుగడ ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ సదస్సులో కేయూ రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం, ముంబాయి యూనివర్సిటీ ప్రొఫెసర్ జోష్ జార్జ్, సోషల్ సైన్స్ డీన్ మనోహర్, రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకటయ్య, బీఓఎస్ చైర్మన్ డాక్టర్ గద్దం కృష్ణ, అధ్యాపకులు సత్యనారాయణ, నాగరాజు, లక్ష్మీనారాయణ, సంజీవ్, భాగ్యమ్మ, లలిత కుమారి, విజయ్, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను రిజిస్ట్రార్ రామచంద్రం ప్రారంభించారు.




ర్యాంప్ వాక్, నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఉత్సాహంగా రూబిజెస్ట్ - 2025

- కేయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహణ
- ఆకట్టుకున్న విద్యార్థినుల ర్యాంప్ వాక్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో రూబిజెస్ట్– 2025లో భాగంగా శుక్రవారం థీమ్ డే వేడుకలను ఉత్సాహంగా కొనసాగాయి. ప్రోగ్రాం కన్వీనర్ సాయి తరుణ్, వివిధ ఆర్గనైజర్ల ఆధ్వర్యంలో యూనివర్సిటీ ఆడిటోరియంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఆయా ఉత్సవాలను ప్రారంభించారు. ఈ వేడుకల్లో కేరళ సంప్రదాయ దుస్తులు ధరించి మహిళా అధ్యాపకులు చేసిన ర్యాంప్ వాక్ ఆకట్టుకుంది. అంతే కాకుండా వారు ఇచ్చిన సోలో, గ్రూప్ డ్యాన్స్‌లు ఆకర్షణగా నిలిచాయి. జాతీయ స్థాయిలో ఉన్న వివిధ ప్రాంతాల, సంప్రదాయ నత్య రీతులవారు ధరించే దుస్తులను ధరించి కళాశాల విద్యార్థినులు చేసిన ర్యాంప్ వాక్ ఆకట్టుకుంది. వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ర్యాంప్ వాక్ ప్రదర్శనలో నిలిచిన బీటెక్ ఈసీఈ విభాగం ప్రథమ సంవత్సరం విద్యార్థిని సుదూప్తికి ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రెడ్డి బహుమతి అందజేశారు.

పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలి

- జీఎం అరుణ్‌కుమార్ జైన్



వరంగల్ రైల్వేస్టేషన్‌లో కొనసాగుతున్న పనులను పరిశీలిస్తున్న జీఎం అరుణ్‌కుమార్ జైన్

ఖిలా వరంగల్: అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద కొనసాగుతున్న వరంగల్ రైల్వేస్టేషన్ పునరుద్ధరణ పనులను శరవేగంగా పూర్తి చేయాలని దక్షణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం వరంగల్ రైల్వేస్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ (ఏబీఎస్ఎస్) కింద రూ.25.41కోట్లలో జరుగుతున్న పాదచారుల వంతెన(ఫుట్ ఓవర్ బ్రిడ్జి), 3 లిఫ్టులు, 4 ఎస్కలేటర్లు, లిఫ్టులు, గ్రీనరీ పనులను పరిశీలించారు. అంతకు ముందుగా రైల్వే కోచ్ రెస్టారెంట్‌ను తిలకించారు. అనంతరం జీఆర్పీ పోలీసులకు నూతన భవనం నిర్మించాలని జీఎంకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఎం భరతేష్‌కుమార్, సీనియర్ డీసీఎం బాలాజీ కిరణ్, స్టేషన్ మేనేజర్ బాలరాజ్‌నాయక్, సీసీఐ రాజగోపాల్, ఆర్పీఎఫ్ సీఐ సీఎస్ ఆర్ కృష్ణ, జీఆర్పీ సీఐ సురేందర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డుకు దరఖాస్తు చేసుకోవాలి

హన్మకొండ: కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డుకు దరఖాస్తు చేసుకోవాలని చేనేత, జౌళిశాఖ హనుమకొండ జిల్లా సహాయ సంచాలకురాలు ఎం.విజయలక్ష్మి తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం చేనేత కళాకారులకు, చేనేత డిజైనర్లకు వారి వృత్తిలో నైపుణ్యత, ప్రత్యేకతల ఆధారంగా అవార్డులు అందిస్తుందని ఆమె శుక్రవారం ఒక ప్రకటనలో వివరించారు. అవార్డు గ్రహీతలకు రూ.25వేల నగదు బహుమతి, మెరిట్ సర్టిఫికెట్, జ్ఞాపిక అందించి సన్మానిస్తారని తెలిపారు.

అర్హతలు...

చేనేత కళాకారులు 2024 డిసెంబర్ 31 నాటికి 30 సంవత్సరాలు పైబడిన వయస్సు కలిగి చేనేత రంగంలో 10 సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలి. చేనేత డిజైనర్లు 2024 డిసెంబర్ 31 నాటికి 25 సంవత్సరాల వయస్సు పైబడి ఉండి 5 సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలి. ఈ అర్హతలు కలిగి ఉన్న ఔత్సాహికులు నిర్ణీత దరఖాస్తు ఫారం నింపి హనుమకొండలోని చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకుల కార్యాలయంలో అందించాలి.

25నుంచి ఎఫ్‌పీఓఎస్ రాష్ట్రస్థాయి మేళా

- వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద, డీఏఓ అనురాధ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్: రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్‌పీఓఎస్) రాష్ట్రస్థాయి మేళా ఈనెల 25నుంచి 27వ తేదీ వరకు వరంగల్ రంగశాయిపేటలో నిర్వహించనున్నట్లు వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద, జిల్లా వ్యవసాయశాఖ అధికారి (డీఏఓ) అనురాధ తెలిపారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో రైతు ఉత్పత్తిదారుల సంఘాల రాష్ట్రస్థాయి మేళాపై శుక్రవారం అధికారులతో సమన్వయ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఈ మేళాలో రైతు ఉత్పత్తిదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వివిధ శాఖలు ఎలా సమన్వయంతో పనిచేయాలానే అంశంపై దిశానిర్దేశం చేశారు. అనంతరం అధికారులతో కలిసి రంగశాయిపేటలోని మేళా స్థలాన్ని కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, డీఆర్డీఓ, ఉద్యాన శాఖ అధికారి సంగీత లక్ష్మి, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ రమేశ్, మత్స్యశాఖ అధికారి నాగమణి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌పై ప్రత్యేక దృష్టి..

ఎల్ఆర్ఎస్ ఆమోదించిన దరఖాస్తుల ఫీజు వసూలుపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు వరంగల్ కలెక్టర్ సత్యశారద తెలిపారు. హైదరాబాద్ నుంచి మున్సిపల్ ప్రధాన కార్యదర్శి దానకిశోర్ శుక్రవారం సాయంత్రం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. జీడబ్ల్యూఎంసీ, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో ఎల్ఆర్ఎస్‌కు 41,443 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. అందులో 18,943 మంజూరు చేసి, 1,081 దరఖాస్తులకు ఫీజు సేకరించి, 1,081 ప్రొసీడింగ్‌లు జారీ చేసినట్లు పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, అధికారులు పాల్గొన్నారు.

టెండర్ల ఆహ్వానం

వరంగల్: జిల్లాలోని 670 అంగన్‌వాడీ కేంద్రాలకు కందిపప్పు సరఫరా చేయడానికి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు వరంగల్ జిల్లా సంక్షేమ అధికారి రాజమణి ఒక ప్రకటనలో తెలిపారు. నర్సంపేట, వర్ధన్నపేట ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని కేంద్రాలకు 2025 ఏప్రిల్ నుంచి మార్చి 2026 వరకు కిలో కందిపప్పు ప్యాకెట్లను నేరుగా సరఫరా చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తిగల సంస్థలు, సరఫరాదారుల నుంచి కొటేషన్స్ ఇవ్వాలన్నారు. జిల్లా సంక్షేమ అధికారి (ఐసీడీఎస్) కార్యాలయంలో ఈనెల 28లోగా దరఖాస్తులు అందించాలని, వివరాల కోసం కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

సీఎస్ఆర్డీలో ఎన్పీడీసీఎల్‌కు 'ఎ' రేటింగ్

హన్మకొండ: కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ విడుదల చేసిన కన్స్యూమర్ సర్వీసింగ్ రేటింగ్ ఆఫ్ డిస్కమ్స్ (సీఎస్ఆర్‌డీ)లో నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (టీజీ ఎన్పీడీసీఎల్) జాతీయ స్థాయిలో 'ఎ' రేటింగ్‌తో కేటగిరిలో 5వ స్థానంలో నిలిచింది. విద్యుత్ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందిస్తూ, త్వరగా సర్వీస్‌ల మంజూరు, ఇతర సేవలు, మీటరింగ్, బిల్లింగ్ ప్రక్రియ వేగంగా నిర్వహించడం, ఫిర్యాదుల పరిష్కారంలో జవాబుదారీతనం, కార్యాచరణలో ముందుండడం ద్వారా దేశంలోని అన్ని డిస్కమ్‌లలో ఎన్పీడీసీఎల్ ఐదో స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్పీడీసీఎల్ పరిధిలో వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందిస్తున్నామన్నారు. అర్బన్ ప్రాంతంలో 23.57 గంటలు, రూరల్ ప్రాంతంలో 22.48 గంటలు సరఫరా అందిస్తున్నామని వివరించారు. జాతీయ సగటుతో పోల్చుకుంటే అర్బన్‌లో 23.30 గంటలు, రూరల్‌లో 21.34 గంటలతో ఆన్‌లైన్ ద్వారా 100 శాతం దరఖాస్తుల ప్రక్రియ చేపట్టడం, బిల్లింగ్ జారీని 100 శాతం పూర్తి చేసినందుకు ఈర్యాంకు వచ్చిందన్నారు.

మోటార్లు ఆన్.. డ్రై రన్ కొనసాగింపు

హసన్‌పర్తి: దేవాదుల ప్రాజెక్టు మూడవ దశలో భాగంగా దేవన్నపేటలో నిర్మించిన పంప్‌హౌజ్ మోటార్ల డ్రై రన్ కొనసాగుతోంది. ఇక్కడ 31 మెగావాట్ల సామర్థ్యం గల మూడు మోటార్లు ఏర్పాటు చేశారు. ఒక్క మోటారు పని చేస్తే సుమారు 800 క్యూసెక్కుల నీటిని ధర్మసాగర్ చెరువులోకి ఎత్తిపోయొచ్చు. శని, ఆదివారాల్లో ట్రయల్ రన్ నడిచే అవకాశం ఉంది. ఆస్ట్రియా దేశం నుంచి సాంకేతిక నిపుణులు ఇక్కడికి చేరుకుని ట్రయల్ రన్ ప్రారంభిస్తారని అధికారులు చెబుతున్నారు.

ఆటో బోల్తా.. మహిళ మృతి

కొముురవెల్లి(సిద్దిపేట): సిద్ధిపేట జిల్లా కొమురవెల్లి మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వరంగల్ నగరానికిచెందిన మహిళ మృతిచెందింది. ఎస్ఐ రాజు కథనం మేరకు.. వరంగల్ కాశిబుగ్గకు చెందిన సబిత(55) కుటుంబంతో కలిసి కొమురవెల్లి మల్లికార్జున స్వామి దర్శనానికి వచ్చారు. దర్శనం అనంతరం తిరిగి వెళ్లే క్రమంలో వేచరేణికి చెందిన ఆటోలో బయలు దేరారు. మండల కేంద్రంలోని పద్మశ్రీ గార్డెన్ సమీపంలోకి రాగానే ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సబిత మృతిచెందగా, పలువురి తీవ్ర గాయాలయ్యాయి.